సాక్షి ప్రకాశం

బుధవారం । 6 । ఆగస్టు । 2025



ఉన్న బస్సులతో ఉచిత బస్సు ఎలా..?

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆర్టీసీ అధికారులకు టెన్షన్ పుట్టిస్తోంది.

- 10లో..



అన్నదాతలను పట్టించుకోని ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు.

- 10లో..

గరిష్టం/కనిష్టం 38 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

8 లోపు స్కూల్స్ గేమ్స్ సెక్రటరీ ధ్రువపత్రాలు సమర్పించాలి

ఒంగోలు సిటీ: 2025–26, 2026–27 కు సంబంధించి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకానికి స్కూల్ అసిస్టెంట్ పీడీ/పీఈటీ ఉపాధ్యాయులు ఈ నెల 8వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో ధ్రువపత్రాలు సమర్పించాలని డీఈఓ కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్గదర్శకాల కోసం నోటీసు బోర్డు చూడాలని కోరారు.

పరీక్షల నియంత్రణాధికారిగా సైమన్ విక్టర్ బాధ్యతలు




ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ విద్యామండలి పరీక్షల నియంత్రణాధికారిగా కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సైమన్ విక్టర్ ను నియమిస్తూ ఇంటర్ విద్య డైరెక్టర్ డా.కృతికా శుక్లా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సైమన్ విక్టర్ 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు ఇంటర్ బోర్డు ప్రకాశం జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలపై పని చేశారు. ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణ, స్పాట్ క్యాంప్ ల నిర్వహణలో ఆయన సేవలను, సమర్థతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సైమన్ విక్టర్ ను ఇంటర్మీడియట్ విద్యామండలి పరీక్షల నియంత్రణ అధికారిగా నియమించారు. ఇంటర్మీడియెట్ విద్యలో ప్రవేశ పెట్టిన సంస్కరణల అమలులో ప్రకాశం జిల్లాను ముందుంచడంలో ఆయన విశేష కృషి చేశారు. ఆయన నియామకంపై ఆర్ఐఓ కార్యాలయ సిబ్బంది, ప్రిన్సిపాళ్ల సంఘం, అధ్యాపక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

పార్టీ రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శిగా బద్దిగం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా యర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన బద్దిగం నాగార్జునరెడ్డిని నియమించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బద్దిగంను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

అన్నదాత దుఃఖీభవ

అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల ఎంపిక దగ్గర నుంచి డబ్బులు ఇచ్చే వరకూ రైతులకు అన్యాయం జరుగుతూనే ఉంది. ఎన్నికల సమయంలో రూ.20 వేలు ఇస్తానంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక దానికి భారీగా కొత పెట్టారు. తొలి ఏడాది ఎగనామం పెట్టారు. రెండో ఏడాది కేంద్రసాయంతో ఇస్తానంటూ ప్రకటనలు చేశారు. చివరకు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.5 వేలు మాత్రమే విదిల్చారు. అవి కూడా సక్రమంగా పడ్డాయా అంటే అదీలేదు. రకరకాల ఆంక్షలతో వేలాది మంది రైతులకు ఈ పథకాన్ని దూరం చేశారు. తాజా ఇచ్చిన డబ్బులు జిల్లాలో 45 వేల మంది రైతుల ఖాతాల్లో జమకాలేదని తెలుస్తోంది.



- దర్శిలో ఆర్భాటంగా సీఎం అన్నదాత సుఖీభవ ప్రారంభం
- వేలాది మంది రైతుల ఖాతాల్లో జమకాని డబ్బులు
- జిల్లాలో 2,65,317 మంది లబ్ధిదారులు
- 43,650 మంది రైతులకు జమకాని నగదు
- సాంకేతిక కారణాలతో జమకాలేదంటున్న అధికారులు
- పీఎం కిసాన్ నిధులు పడుతుండగా ఇవెందుకు పడలేదు..
- బ్యాంకులు చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు

43,650 మంది రైతులకు జమ కాని నగదు

దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో అట్టహాసంగా ఎర్రటి ఎండలో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ సెట్టింగ్ కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయింది. దానికి తగ్గట్టుగానే రైతుల బ్యాంకు ఖాతాలకు కూడా డబ్బులు జమ కాకుండా ఫ్లాప్ షో అయింది. వేదిక మీద చంద్రబాబు రాష్ట్రంలో, జిల్లాలో, దర్శి మండలంలో చివరకు కార్యక్రమం జరుగుతున్న తూర్పు వీరాయపాలెంలోని రైతులకు కోట్లాది రూపాయలు పడ్డాయని లెక్కలతో సహా చెప్పారు. ఇదంతా టీవీల్లో లైవ్ కార్యక్రమం చూసే ప్రేక్షకులను, ప్రజలను నమ్మించటానికేనన్నది స్పష్టమైంది. చివరకు జిల్లాలో 43,650 మంది రైతులకు సుఖీభవ నగదు జమ కాలేదు. ముందుగా అన్ని అంశాలను అనేక సార్లు పరిగణలోకి తీసుకున్న జిల్లా వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సాంకేతిక పొరపాట్లను ఎందుకు పసిగట్టలేకపోయారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసినా.. ఎందుకు రైతులు లబ్ధి పొందలేక పోతున్నారు. ఇదంతా కావాలని సాంకేతిక సమస్యలను సృష్టించటమా ఏమిటన్నది అన్నదాతలకు అర్థం కావటం లేదు.

> **అన్నదాత సుఖీభవ నగదు జమకాలేదు**
>
> 
>
> గత ప్రభుత్వంలో రైతు భరోసా నగదు నా ఖాతాలో జమయ్యేవి. కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ నగదు మాత్రం రాలేదు. ఎందుకు రాలేదో తెలియడం లేదు.
>
> – వాకా యశోద, మర్రిపూడి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏంచేశారంటూ ప్రతిపక్షాలు, రైతులు వెంటపడుతున్నారు. ఏదో ఒకటి చేసేద్దాం.. ఎంత మందికి ప్రయోజనం కలిగిందా లేదా అన్నది తరువాత అన్నట్లుంది ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. 2024లో చంద్రబాబు అధికారంలోకి రాగానే జూన్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్ నుంచే అన్నదాత సుఖీభవ ఇవ్వాల్సి ఉంది. ఎందుకంటే ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి పీఎం కిసాన్ సాయంతో సంబంధం లేకుండా రూ.20 వేలు రాష్ట్ర ప్రభుత్వం తరపున సాయం చేస్తానన్నాడు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అన్నదాతకు సుఖీభవ మాత్రం అందలేదు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఏరువాక కార్యక్రమాన్ని పండుగలా చేయాలని అధికారులకు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు చెప్పారు కానీ రైతులు పండుగ చేసుకునే అవకాశాన్ని మాత్రం కల్పించలేదు. రెండో ఏడాది వచ్చింది ఇప్పుడన్నా గత ఏడాది సాయం, ఈ ఏడాది సాయం రెండూ కలిపి ఏమైనా ఇస్తాడేమోనని రైతులు ఎంతో ఆశగా ఎదురు చూశారు. అన్నదాత సుఖీభవ రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించాలని నిర్ణయించటం, అందుకు దర్శి మండలంలోని తూర్పు వీరాయపాలెం వేదిక కావటంతో రైతులు ఎంతో సంబరపడ్డారు. చివరకు చంద్రబాబు అన్నదాత సుఖీభవ కార్యక్రమం కాస్తా ''ఏనుగు సామెతను'' తలపించింది.

లబ్ధిదారుల ఎంపికలో భారీగా కొత

అన్నదాత సుఖీభవ పథకం కోసం జిల్లా అధికారులు ఎంతో కసరత్తు చేసిమరీ 2,65,317 మందిని అర్హులుగా తేల్చారు. జిల్లాలో మొత్తం 5,31,369 మంది రైతులను వెరిఫై చేసి 4,38,251 రైతుల జాబితాను సిద్ధం చేశారు. ఆ జాబితాను ఉన్నతాధికారులకు పంపగా.. అందులో ఆర్బీకేఎస్ పరిధిలో జాబితాను పరిశీలించి 2,72,824 మంది రైతులను లబ్ధిదారులుగా గుర్తించారు. వీరికి ఏకేవైఎస్ పూర్తి చేయాలన్నారు. చివరకు లబ్ధిదారులు 2,65,315గా తేల్చారు. ఈ పథకానికి ప్రభుత్వ భూమి ఉన్నవారు అర్హులు కారని, డీ పట్టాలు, అసైన్డ్ భూములు, ఇనామ్ భూములు కలిగిన రైతులు కూడా ఈ పథకానికి అర్హులు కాదని తేల్చారు. దేవదాయ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు కౌలు రైతులతో పాటు ఏడాదిలో రెండు సార్లు సాయం అందిస్తామని ప్రకటించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వహయాంలో రైతు భరోసాకింద జిల్లాలో సుమారు 2.85 లక్షల మంది రైతులకు సాయం అందేది. తాజా లెక్కల ప్రకారం 20 వేల మంది ఈ పథకానికి దూరమైపోయారు.

పీఎం కిసాన్ మాదిరిగానే సుఖీభవలో పడ్డాయా...

జిల్లాలో పీఎం కిసాన్ పథకంలో రైతులకు పడినట్లుగానే సుఖీభవలో కూడా అన్నదాత సుఖీభవ సాయం పడిందా అన్న అనుమానాలు రైతుల్లో కలుగుతున్నాయి. ఈకేవైసీ చేసినా కూడా 43,650 మంది రైతులకు ఎందుకు సుఖీభవ నగదు బ్యాంకు అకౌంట్లకు జమకాలేదన్నది అంతుబట్టడం లేదు. పీఎం కిసాన్ మాదిరిగా 2.10 లక్షల మందికే పడి ఉంటే మరో 21,667 మంది రైతులకు కూడా అన్నదాత సుఖీభవ నగదు బదిలీ జరిగి ఉండకూడదు. అప్పుడు మొత్తం కలిపి 65,317 మంది రైతులకు అన్నదాత సుఖీభవ నగదు బదిలీ జరిగి ఉండలేదన్న మాట. ఈకేవైసీ చేసేటప్పుడు అధికారులు, సిబ్బంది ఆధార్ మిస్ మ్యాచింగ్, మనుగడలో లేని బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించారు. భూయజమాని చనిపోతే ఈకేవైసీ ఏవిధంగా చేశారన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. అలాంటప్పుడు ఎందుకు సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రిజర్వేషన్ పై కౌంటర్ దాఖలుకు హైకోర్టు ఆదేశం

ఒంగోలు టౌన్: యర్రగొండపాలెం మార్కెట్ యార్డ్ చైర్మన్ నియామకం విషయంలో రిజర్వేషన్ పాటించకపోవడంపై సోమవారం హైకోర్టులో వాదనలు జరిగినట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఉద్యోగుల సంఘం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆరె రమణయ్య తెలిపారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనాభా ప్రాతిపదిక, రొటేషన్ పద్ధతి ప్రకారం యర్రగొండపాలెం మార్కెట్ యార్డు పదవిని ఎస్టీకి రిజర్వ్ చేశారన్నారు. స్వయంగా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ, చట్టాన్ని ఉల్లంఘిస్తూ యర్రగొండపాలెం మార్కెట్ యార్డు పదవిలో ఓసీ అభ్యర్థిని నియమించారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ఓసీ జనరల్ అభ్యర్థిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు నెంబర్ 593 ను సవాల్ చేస్తూ తనతో పాటుగా మరో ఇద్దరు గిరిజనులు కూడా హైకోర్టును ఆశ్రయించారన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం హైకోర్టులో వాదనలు జరిగాయని వివరించారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి ఈనెల 13 వ తేదీ లోపు కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ఆదేశించిందని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది ఇందుకు మూడు వారాల గడువు అడిగినా న్యాయమూర్తి 13వ తేదీ వరకే గడువు ఇచ్చినట్లు చెప్పారు.

పదవీ బాధ్యతలు చేపట్టారా...?

ఇప్పటికే తాను పదవీ బాధ్యతలు చేపట్టినట్లు మార్కెట్ యార్డు చైర్మన్ గా నియమితుడైన టీడీపీ నాయకుడు చేకూరి సుబ్బయ్య చెబుతున్నారు. ఇదే విషయంపై ఆయన హైకోర్టులో పిటిషన్ వేసినట్లు సమాచారం. అయితే సుబ్బయ్య పదవీ బాధ్యతలు చేపట్టలేదని, కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూన్ 6వ తేదీన రిజర్వేషన్లు నిర్ణయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. చట్ట ప్రకారం ఈ రిజర్వేషన్లను నిర్ణయించిన తరువాత ఎస్టీకి రిజర్వ్ చేసిన పదవిని ఒక ఓసీ అభ్యర్థి ఎలా స్వీకరిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికార కూటమి నాయకుల ఒత్తిళ్లకు లొంగిపోయిన అధికారులు సుబ్బయ్య పదవీ బాధ్యతలు చేపట్టినట్లు తప్పుడు రికార్డులు సృష్టించారని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన రిజర్వేషన్‌ను కాదని ఓసీ అభ్యర్థిని నియమించడం, ఆయన బాధ్యతలు చేపట్టడం చట్ట వ్యతిరేకమని దళిత సంఘాలు వాదిస్తున్నాయి. జిల్లాలోని ఇతర మార్కెట్ యార్డుల విషయంలోనూ ఇలాంటి రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందని, ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకోవాలని దళిత నాయకులు కోరుతున్నారు.

ప్రలోభాలు..బెదిరింపులు

- పోలీసుల కనుసన్నల్లో కొండపి పంచాయతీ ఎన్నికలు
- ఓటమి భయంతో పోలీసులనే నమ్ముకున్న టీడీపీ అధిష్టానం
- ఎన్నికలు జరిగితే కూటమి ప్రభుత్వానికి ఓటమే అంటున్న ప్రజలు
- ఫోర్జరీ సంతకాలు, బెదిరింపులతో ఏకగ్రీవం చేసుకున్న ప్రభుత్వం
- ముమ్మాటికీ అప్రజాస్వామిక గెలుపు అంటున్న వైఎస్సార్ సీపీ



కొండపి సచివాలయం వద్ద మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కొండపి గ్రామ పంచాయతీ ఎన్నిక కూటమి ప్రభుత్వంలోని డొల్లతనాన్ని బయట పెట్టింది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము, ధైర్యం ఈ ప్రభుత్వానికి లేవని నిరూపితమైంది. కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి టీడీపీ నాయకులు ప్రలోభానికి తెరలేపారు. మొదట వైఎస్సార్ సీపీతో 14 వార్డుల్లో 9 టీడీపీ, 5 వైఎస్సార్ సీపీకి, సర్పంచ్ టీడీపీ మద్దతు అభ్యర్థులకి కేటాయించేటట్లు ప్రలోభాలతో ప్రారంభించారు. ఈ ప్రతిపాదనను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తిరస్కరించి ఎన్నికల బరిలో సర్పంచ్ పదవికి, 14 వార్డు పదవులకు నామినేషన్ దాఖలు చేయించారు. మంగళవారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు సమీపించడంతో టీడీపీ అధిష్టానం ఎలాగైనా ఏకగ్రీవంగా గెలవాలని ఇందుకోసం సామ దాన భేద దండోపాయాలు ఉపయోగించింది. మొదట నాయకుల చేత రాజీ చర్చలు ఫలప్రదం కాకపోవటంతో దండోపాయాన్ని ఎంచుకుని తమ తొత్తులైన పోలీసులను రంగంలోకి దించింది. దీంతో వీరు మంగళవారం ఉదయం నుంచే వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీలో ఉన్న ముగ్గురు మహిళా అభ్యర్థులు యనమద్ని కళ్యాణి, అడ్డగబొట్టు విమలమ్మ, పల్లెమేరిలను టార్గెట్ చేసి తమ పథకాన్ని అమలు చేశారు. మొదట కళ్యాణి ఇంటికి భారీగా పోలీసులతో వెళ్లి ఆమెను ఒక సీఐ బెదిరించి విత్‌డ్రా చేయించారు. తరువాత పక్క జిల్లాకు చెందిన సీఐను రంగంలోకి దింపి పల్లె మేరిని ప్రలోభపెట్టే పనిచేశారు. చివరగా విమలమ్మ ఎలాగైనా పోటీలో ఉండాలనే ఉద్దేశంతో టీడీపీ నాయకులకు దొరక్కుండా బస్సులో వెళుతుండగా టెక్నాలజీ సహాయంతో పసిగట్టి మరొక సీఐని రంగంలోకి దింపి అతని చేత వెళ్తున్న బస్సును ఆపి మరీ విమలమ్మను బెదిరించి ఆమె చేత బలవంతంగా వేలి ముద్రలు వేయించి నామినేషన్ విత్‌డ్రా చేయించారు. వాస్తవానికి 3 గంటలకల్లా నామినేషన్ విత్‌డ్రా కార్యక్రమం ముగించాల్సి ఉంది. కానీ ఎన్నికల అధికారి రవిబాబు ఆదేశాలతో మధ్యాహ్నం 3.15 గంటలకు గది తలుపులు మూశారు. దీంతో సర్పంచ్ ఎన్నికల జరుగుతుందని భావించారు. అయితే వైఎస్సార్ సీపీ అభ్యర్థులంతా విత్‌డ్రా చేసుకున్నారని, ఒక వేళ అభ్యర్థి విత్‌డ్రా చేయటానికి రాలేకపోతే ఆమె నామినేషన్‌కు ప్రపోజల్ పెట్టిన వారి చేత విత్‌డ్రా పత్రాలు సమర్పించవచ్చని ఆ ప్రకారం విత్‌డ్రా పత్రాలు ఎన్నికల అధికారి వద్దకు చేరాయని ఇక ఏకగ్రీవం అని ప్రకటించటమే తరువాయని టీడీపీ నాయకులు తెలిపారు. దీంతో అప్రమత్తమైన ఆదిమూలపు సురేష్ ముందు జాగ్రత్త చర్యగా మేరి ఆరోగ్యంగా ఉందని, ఆమె అనారోగ్యంగా ఉండి రాలేని పరిస్థితిలో ఆమెకు ప్రపోజల్ సంతకం పెట్టిన వ్యక్తి ఫోర్జరీ సంతకాలతో విత్‌డ్రా ఫారం అందజేసే అవకాశం ఉందని, దానిని ఆమోదించవద్దని రాతపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల అధికారి వద్దకు వెళ్లి కలిసే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన సీఐ సోమశేఖర్ వెంటనే సురేష్ ఎన్నికల అధికారిని కలవాలంటే 5 గంటల తరువాతేనని చెప్పి అడ్డుకుని ఆయనను అక్కడి నుంచి పంపించేశారు.

వీళ్లకో న్యాయం..వాళ్లకో న్యాయమా..

మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ గడువు ముగియగా 3.15 గంటలకు ఎన్నికల అధికారి తలుపులు మూసి ఇంకెవరు విత్‌డ్రా లు చేసుకోవటానికి లేదన్నారు. కానీ టీడీపీ నాయకులు తరువాత కూడా కార్యాలయంలోకి వెళ్లి వస్తున్నా వారిని ఎవరూ అడ్డుకోలేదు. 3.45 గంటలకు కార్యాలయానికి వచ్చిన సురేష్‌ను ఎన్నికల అధికారిని కలవకుండా అడ్డుకుని పంపించేశారు. తరువాత 4 గంటల సమయంలో ఉపాధి హామీ పథకానికి చెందిన సిబ్బంది విమలమ్మ చేత సీఐ బలవంతంగా వేలిముద్రలు వేయించిన కాగితాలను తీసుకొచ్చి ఎన్నికల అధికారికి అందజేసి చివరికి ఎన్నిక ఏకగ్రీవం అని ప్రకటించారు.

భారీ బందోబస్తు..

గ్రామ పంచాయతీ ఎన్నికల విత్‌డ్రా కార్యక్రమానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేయటంపై కొండపి గ్రామ ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలను డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షించగా ఒక సీఐ, ఐదుగురు ఎస్సైలు, దాదాపు 150 సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులను బెదిరించి విత్‌డ్రా చేసే క్రమంలో ప్రజలు ఏమైనా తిరగబడతారేమోనన్న అనుమానంతో ఈ విధంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసుకున్నారా అని మండల ప్రజలు చర్చించుకున్నారు.

ఆద్యంతం బెదిరింపుల పర్వం

గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి విత్‌డ్రా ప్రక్రియ ముగించే వరకు పోలీసులు బెదిరింపుల పర్వం సాగించారు. మొదట వార్డు సభ్యులను సోమవారం రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల అధికారి 8 మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల విత్‌డ్రాలను ఆమోదించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సురేష్ ఎన్నికల అధికారి రవిబాబును నిబంధనల ప్రకారం ఎలా విత్‌డ్రాలు చేస్తారని ప్రశ్నిస్తే సాయంత్రం 5 గంటల లోపే వారి చేత విత్‌డ్రా చేయించానని బుకాయించే ప్రయత్నం చేశారు. దీనిపై సురేష్ స్పందిస్తూ 5 గంటల సమయంలో వారు తన వద్దే ఉన్నారని అలాంటప్పుడు విత్‌డ్రా ఎలా చేస్తారని ప్రశ్నించటంతో నీళ్లు నమలటం రవిబాబు వంతయింది. దీనిపై డీజీపీ, గుంటూరు డీఐజీ, రాష్ట్ర ఎన్నికల కమిషన్, మానవ హక్కుల సంఘానికి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు వాట్సాప్ ద్వారా సురేష్ ఫిర్యాదు చేశారు. దీనిపై న్యాయపోరాటం చేస్తానని కోర్టులను ఆశ్రయిస్తానని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి బందోబస్తు

వైఎస్సార్‌సీపీ నాయకులు అడక్కుండానే పార్టీ కార్యాలయం వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లను సాధారణ దుస్తుల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. తరువాత కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారి వద్ద ముగ్గురు ఎస్సైలు, 10 మంది కానిస్టేబుల్స్ బందోబస్తు నిర్వహించారు. పార్టీ కార్యాలయానికి వచ్చిన వారు బయటకు వెళ్తుంటే రోడ్డు మొదట్లో ఎస్సై ప్రేమ్‌కుమార్ ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు అడ్డుకున్నారు. చివరికి ఎన్నికల ఫలితాలు విడుదలైన తరువాత కార్యాలయంలో విలేకరుల సమావేశానికి వస్తున్న విలేకరులను కూడా ఎస్సై స్థాయి అధికారి అడ్డుకునే ప్రయత్నం చేశారు. తరువాత కార్యాలయంలో విలేకరుల సమావేశం జరుగుతున్నంత సేపు డ్రోన్ కెమెరాతో వీడియో తీసే ప్రయత్నం చేశారు. ఈ విధంగా వైఎస్సార్ సీపీ నాయకులను అడుగడుగునా పోలీసులు అడ్డుకుని ఎట్టకేలకు సర్పంచ్ పదవిని టీడీపీకి అప్పగించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

- పోలీసుల కనుసన్నల్లో కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికలు
- వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులను సీఐలు బెదిరించారు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

కొండపి: కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. దాదాపు 14 ఏళ్ల తరువాత జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేద్దామని భావించిన దళిత మహిళల ఆశలను పోలీసుల అండదండలతో అడియాశలు చేశారని, ఇందులో టీడీపీ నాయకులు ప్రధానపాత్ర పోషించారని ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ నాయకుల అరాచకాలను సురేష్ వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయి విత్‌డ్రా కార్యక్రమం ముగిసే వరకు కూటమి నాయకులు పోలీసుల సహకారంతో అనేక వికృత విన్యాసాలు చేశారని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో సర్పంచ్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించారని, దీంతో టీడీపీ నాయకులు పోలీసుల అండదండలతో అరాచకానికి తెరతీశారన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో బరిలో నిలిచిన మహిళా అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. చట్టాలను, ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కి ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా 5 రోజుల ముందే పోలీసుల బెదిరింపులతో ఎన్నికలు ముగించారన్నారు.

ముగ్గురు సీఐలతో బెదిరింపుల పర్వం:

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోలీసులు, టీడీపీ నాయకులు, అధికారులు సంయుక్తంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులు మహిళా అభ్యర్థులపై బెదిరింపు రాజకీయాలకు దిగారని ఇందులో ముగ్గురు సీఐలు ప్రధానపాత్ర పోషించారని ఆరోపించారు. మా మద్దతు అభ్యర్థుల్లో ఒకరైన యనమద్ని కళ్యాణి ఇంటికి ఒక సీఐ వెళ్లి బెదిరించి మరీ విత్‌డ్రా ఫారాలపై సంతకాలు తీసుకున్నారన్నారు. కళ్యాణి భర్త వసంతరావు ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడని, నీ భర్త ఉద్యోగం ఎలా చేస్తాడో చూస్తామని బెదిరింపులకు దిగారని ఆరోపించారు. ఈ విషయమై కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్‌కు సదరు సీఐపై ఫిర్యాదు చేస్తే ఆయన కొత్త కథ అల్లారని విమర్శించారు. అభ్యర్థి కళ్యాణి విత్‌డ్రా ఫారాలు తీసుకుని సీఐ వద్దకు వెళ్లి ఎన్నికల్లో పోటీ చేయటం లేదని చెప్పిందని కట్టుకథ అల్లారని విమర్శించారు. ఏ అభ్యర్థి అయినా ఎన్నికల్లో విత్‌డ్రా చేయాలంటే ఎన్నికల అధికారి వద్దకు వెళ్తారే తప్ప పోలీసుస్టేషన్‌కు ఎందుకు వెళ్తారని ప్రశ్నించారు. మరో అభ్యర్థి పల్లెమేరి చేత విత్‌డ్రా చేయించే బాధ్యత మరో సీఐ పై టీడీపీ నాయకులు పెట్టారన్నారు. ఈమె సుమారు 200 కిలోమీటర్ల దూరంలో పూర్తి ఆరోగ్యంగా ఉంటే .. అనారోగ్యంగా ఉందని విత్‌డ్రా చేయటానికి రాలేదని చెప్పి ఈమెకు ప్రపోజల్ చేసిన వ్యక్తి చేత విత్‌డ్రా ఫారాలపై ఫోర్జరీ సంతకాలు చేసి ఇచ్చారన్నారు. ఈ ఫోర్జరీ బాగోతంపై తాను ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేద్దామని వెళితే సీఐ సోమశేఖర్ తనను కలవకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. మరో అభ్యర్థి అడ్డబొట్టు విమలమ్మ టీడీపీ నాయకుల నుంచి భద్రత లేకపోవటంతో విత్‌డ్రా సమయం ముగిసే వరకు బస్సుల్లో తిరుగుతుంటే రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఈమెను మద్దిపాడు వద్ద బస్సు ఆపి చదువురాని ఈమె చేత బలవంతంగా విత్‌డ్రా ఫారాలపై వేలిముద్రలు వేయించి సుమారు 4 గంటల సమయంలో ఆ విత్‌డ్రా ఫారాలను తీసుకొచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఒక ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగి చేత ఇప్పించారని ఆరోపించారు. ఈ విధంగా ఎన్నికల్లో పోలీసులు తమ పాత్ర పోషించి చివరికి ఎన్నికలు ఏకగ్రీవం అని ప్రకటించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు.

ఎన్నికల్లో పోటీ చేసేది మహిళా అభ్యర్థులు:

కొంతమంది టీడీపీ నాయకులు సర్పంచ్ అభ్యర్థి విషయంపై అసభ్యకరంగా మాట్లాడారని.. ఈ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి మహిళ అని గుర్తు చేశారు. మగతనం అంటే ఇలా పోలీసులను అడ్డం పెట్టుకుని మహిళలను బెదిరించి అడ్డదారుల్లో గెలవటం కాదని, చేతనైతే దమ్ముంటే ప్రజాస్వామ్య యుతంగా స్వేచ్ఛా వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి గెలవాలని హితవు పలికారు. ఎన్నికల ప్రక్రియను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, టీడీపీ నాయకులకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

సమావేశంలో సురేష్ వెంట పార్టీ మండల అధ్యక్షుడు బచ్చల కోటేశ్వరరావు, ఢాకా పిచ్చిరెడ్డి, మారం రెడ్డి వెంకటాద్రిరెడ్డి, వసంత్‌రావు, దుద్దుగంట మల్లిఖార్జునరావు, బెజవాడ వెంకటేశ్వర్లు, చింతపల్లి హరిబాబు, పిన్నిక శ్రీనివాసులు, ఇనకొల్లు సుబ్బారెడ్డి, బొల్లినేని నాగేశ్వరరావు, పెట్లూరి కృష్ణమూర్తి,వి మల్లిఖార్జునరెడ్డి, షేక్ సల్మాన్, షేక్ కరీం, పాకనాటి సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దు

- ప్రజలపై విద్యుత్ భారాలు రద్దు చేయాలి
- విద్యుత్ భవన్ వద్ద ధర్నాలో ఏఐటీఎఫ్‌యూ రాష్ట్ర నాయకుడు డీవీ స్వామి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు

ఒంగోలు సబర్బన్: తమ ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని ఏఐటీఎఫ్‌యూ రాష్ట్ర నాయకుడు డీవీ స్వామి అన్నారు. ఈ మేరకు ఒంగోలు నగరంలోని సంతపేట వద్ద స్థానిక ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ ఒంగోలు నగర్ కార్యదర్శి టీ మహేష్ అధ్యక్షత వహించారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ విద్యుత్ రంగ ప్రైవేటీకరణలో భాగంగా అదానీ కంపెనీకి స్మార్ట్ మీటర్ల బిగింపునకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. స్మార్ట్ మీటరు బిగింపు విద్యుత్ వినియోగదారులందరికీ ప్రమాదకరంగా తయారవుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపునకు అయ్యే ఖర్చు కూడా ప్రజల మీద మోపుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచే పద్ధతిలో భారాలు వేయటం అత్యంత దారుణమన్నారు. బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలని, ఇంటికి బిగించే స్మార్ట్ మీటర్లు పూర్తిగా రద్దు చేయాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ రైతు సంఘం సంయుక్త జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్.కే మాబు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఎంఎస్ సాయిబాబా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఆర్.మోహన్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఐద్వా, పెన్షనర్ల సంఘం, పట్టణ అభివృద్ధి కమిటీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుమారుడిపై తండ్రి దాడి


వైద్యశాలలో చికిత్స పొందుతున్న బయ్యన్న

పెద్దదోర్నాల: కుమారుడిపై తండ్రి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని అయ్యన్నకుంటలో సోమవారం రాత్రి జరిగింది. ఈ సంఘటనలో బయ్యన్న తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన కుడుముల వెంకటేశం భార్యపై చేయి చేసుకున్నాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న అతని కుమారుడు బయ్యన్న..తండ్రిని అడ్డుకోవడంతో గొడ్డలిలో దాడి చేయడంతో అతని తలపై తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన బయ్యన్నను బంధువులు చికిత్స నిమిత్తం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బిడ్డకు పాలిస్తే రొమ్ము క్యాన్సర్ దూరం


తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు

ఒంగోలు టౌన్: నిర్ణీత కాలం వరకు బిడ్డకు పాలివ్వడం ద్వారా రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా తల్లులను కాపాడవచ్చని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం జీజీహెచ్‌లోని గైనకాలజీ విభాగంలో తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యరావు మాట్లాడుతూ...తల్లిపాలు తాగిన పిల్లలు బలంగా ఉంటారని, వారిలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లిపాలు తాగిన పిల్లల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉంటుందని, తల్లులు కూడా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. సృష్టిలో తల్లిపాలకు మించింది లేదన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సదస్సులో పాల్గొన్న మహిళలు ఇంటికి వెళ్లినప్పుడు తల్లిపాల ప్రాముఖ్యత గురించి చుట్టుపక్కల వారికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో గైనకాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సంధ్యారాణి, పెడియాట్రిక్ హెచ్‌ఓడీ డాక్టర్ తిరుపతిరెడ్డి, ఆర్‌ఎంఓ డాక్టర్ మాధవీలత, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

● మహిళ మృతి, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు

చౌటుప్పల్ రూరల్: రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో మహిళ మృతిచెందింది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం గ్రామ స్టేజీ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం చిరుకూరపాడు గ్రామానికి చెందిన మద్దిరాల ప్రవీణ్‌కుమార్ బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ.. నెల రోజుల క్రితం హైదరాబాద్‌కు బదిలీ అయ్యాడు. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో నివాసం ఉండడానికి ఇల్లు చూసుకున్నాడు. తన తల్లి గోవిందమ్మ(62), భార్య సుమతితో కలిసి అద్దె ఇంట్లో దిగేందుకు స్వగ్రామం చిరుకూరుపాడు నుంచి సోమవారం రాత్రి 9గంటలకు కారులో హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో మంగళవారం తెల్లవారుజామున చౌటుప్పల్ దాటిన తర్వాత బొర్రోళ్లగూడెం గ్రామ స్టేజీ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. కారు ముందు సీట్లలో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్, అతడి భార్య సుమతికి స్వల్ప గాయాలయ్యాయి. వెనుక సీట్లలో కూర్చున్న ప్రవీణ్ తల్లి గోవిందమ్మకు ఛాతీ భాగంలో బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గోవిందమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి మరిది మద్దిరాల నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. సీఐ మన్మథకుమార్, ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఉన్న బస్సులతో ఉచిత బస్సు ఎలా.?

- ఉచిత బస్ ప్రయాణంపై ఆర్టీసీ అధికారుల్లో టెన్షన్
- తగ్గనున్న బస్ రూట్‌లు
- ఇప్పటికీ చాలా గ్రామాలకు ఆటోలే దిక్కు..



మార్కాపురం ఆర్టీసీ డిపో

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15న ప్రవేశపెట్టనున్న ఉచిత బస్సు ప్రయాణం ఆర్టీసీ అధికారుల్లో టెన్షన్ పుట్టిస్తోంది. ఉన్న బస్సులతో ఎలా నడపాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కొత్త బస్సులు ఇప్పట్లో వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వం కూడా కొత్త బస్సులపై ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదు. దీంతో ఉన్న బస్సులను ఉచిత బస్సులుగా మారిస్తే కొన్ని రూట్లలో బస్సు సర్వీసులను రద్దు చేయాల్సి ఉంటుంది. అలా చేస్తే ప్రయాణికుల నుంచి నిరసనలు వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఆ రూట్లలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటే సంస్థ ఆదాయం తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆ గ్రామాలకు ఆటోలే దిక్కు...


బస్సులు లేక ఆటోల్లో వెళ్తున్న మహిళలు

ఇప్పటికీ మార్కాపురం, తర్లుపాడు మండలాల్లోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఆటోల్లోనే మార్కాపురం వస్తుంటారు. మార్కాపురం మండలంలోని బోడపాడు, రాజుపాలెం, నాగులవరం, నికరంపల్లి, తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువు, మీర్జపేట, కారుమానిపల్లె తదితర గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ సౌకర్యం లేదు. ఈ గ్రామాల ప్రజలకు అత్యవసరమైనా సాధారణ పనైనా.. ఆటోల్లో, బొలెరో వాహనాల్లో పనులకు రావాల్సిందే. ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి. ఈ నెల 15 నుంచి ప్రారంభించే ఉచిత సర్వీసులకు వీరు దూరం కానున్నారు. తమ స్వగ్రామాల నుంచి ఆటోల్లో మార్కాపురం వచ్చి తాము ప్రయాణం చేయాల్సిన గమ్యానికి వెళ్లాల్సిందే. ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం విషయంలో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఒక వైపు కొత్తబస్సులు రాకపోగా, ఉన్న బస్సులనే రాజధానికి జిల్లా కేంద్రానికి కేటాయిస్తే ప్రస్తుతం నడుస్తున్న సర్వీసుల్లో కొన్నైనా రద్దు చేయాల్సిందే. దీనితో ఎలా చేయాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే ఉచిత బస్సుపై ప్రజల్లో, ప్రభుత్వంపై వ్యతిరేకతతో పాటు అయోమయం, గందరగోళం నెలకొంది.

ఏం చేయాలో తెలియక మల్లగుల్లాలు..?

మార్కాపురం డివిజన్‌లో మార్కాపురం, గిద్దలూరు, పొదిలి డిపోలు ఉన్నాయి. మార్కాపురం డిపోలో ప్రస్తుతం 90 ఆర్టీసీ బస్సులు, 16 హైర్ బస్సులు ఉన్నాయి. వీటిలో 50 పల్లెవెలుగు సర్వీసులు ఉన్నాయి. ప్రతిరోజూ సుమారు 39 వేల కిలోమీటర్లు తిరుగుతాయి. ఉచిత బస్సు అమలు చేస్తే మార్కాపురం, ఒంగోలు, నంద్యాల తదితర ప్రాంతాలకు నడిపే సర్వీసులను కొంత దూరం వరకే పరిమితం చేసే అవకాశం ఉంది. ఉచిత బస్సు అమలయ్యే తరువాత నుంచి మార్కాపురం నుంచి ఒంగోలుకు ప్రస్తుతం నడుపుతున్న ఆర్డినరీ సర్వీసులను పొదిలి వరకు మాత్రమే నడపాలని అధికారులు తాత్కాలికంగా నిర్ణయించారు. ఇలా అయితే పొదిలి, ఒంగోలు మధ్య మార్కాపురం డిపో నుంచి ఆర్డినరీ సర్వీసులు తగ్గనున్నాయి. అలా చేస్తే ప్రయాణికులు ఇబ్బంది పడతారు.

తప్పించుకున్నాడా..

తప్పించారా..?

- దొంగను పోలీసులే తప్పించినట్లు గుసగుసలు
- దొంగ పారిపోయేంత నిర్లక్ష్యంగా ఎలా ఉంచారన్న సందేహాలు..?
- తప్పించుకున్న దొంగ నగరంలోనే మళ్లీ చోరీలకు పాల్పడటంపై అనుమానాలు..

ఒంగోలు టౌన్: నగరంలో వరుస దొంగతనాలకు పాల్పడిన ఒక దొంగ పోలీసుల అదుపులో నుంచి తప్పించుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే..గత నెలలో నగరంలో వరుసగా చోరీలు జరిగాయి. ఈ చోరీలన్నీ ఒకే తరహాలో తాళాలు వేసి ఉన్న దుకాణాలు, నివాస గృహాల్లో జరగడంతో పాటుగా మొత్తం చోరీలు నగర శివారు ప్రాంతంలోనే జరగడంతో ఎస్పీ ఏఆర్ దామోదర్ సీరియస్‌గా తీసుకున్నారు. పోలీసులకు గట్టిగా క్లాస్ తీసుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కేసును ఛేదించేందుకు నగర శివారు ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. ఎట్టకేలకు దొంగ పోలీసులకు చిక్కాడు. పోలీసుల విచారణలో ఐదు ప్రాంతాల్లో చోరీ చేసినట్లు అంగీకరించినట్లు సమాచారం. ఇక్కడే కథ అడ్డం తిరిగింది. పోలీసుల అదుపులో ఉన్న దొంగ పరారీ అయ్యాడు. పరారైన దొంగ మళ్లీ నగరంలో చోరీలకు తెగబడ్డాడు. పోలీసుల అదుపులోంచి తప్పించుకున్న దొంగ సంబంధిత పోలీసుస్టేషన్ సరిహద్దులు దాటిపోవడం సహజం. కొందరైతే ఏకంగా జిల్లా రాష్ట్ర సరిహద్దులు దాటిపోతారు. కానీ ఈ దొంగ మాత్రం అలా పారిపోలేదు. నగరంలోనే మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డాడు. మళ్లీ మరో ఐదు దుకాణాలకు కన్నం వేశాడు. ఇంత ధైర్యం ఆ దొంగకు ఎక్కడ నుంచి వచ్చిందన్న విషయంపై పలు రకాలుగా చర్చ జరుగుతోంది.

పోలీసులే తప్పించారా...?

పోలీసులే దొంగను తప్పించారని ఆ శాఖలోని కొందరు గుసగుసలాడటం గమనార్హం. ఈ నెల 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శి పర్యటన ఉండడంతో ఒంగోలులో ఉన్న పోలీసులు బందోబస్తుకు వెళ్లారు. సీసీఎస్‌లో పోలీసులు దొంగను విచారిస్తున్నట్లు చెబుతున్నారు. పోలీసులు విచారిస్తున్న సమయంలో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దొంగ పారిపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వరుస చోరీలకు పాల్పడుతూ పోలీస్ శాఖకే తలనొప్పిగా ఉన్న దొంగ విషయంలో ఇంతటి నిర్లక్ష్యంగా ఎలా వ్యవహరించారని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు విచారిస్తే అసలు నిజాలు బయటకు వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆటపాటలతో ప్రభుత్వాలను నిలదీస్తాం


బస్సు ప్రచార యాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: ఆట, పాట, మాటలతో ప్రజలను చైతన్యం చేసి ప్రభుత్వాలను నిలదీస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. సీపీఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని ఏపీ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ప్రచార బస్సు యాత్రను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ పోరాటాల పురిటి గడ్డ ఒంగోలు నగరంలో తొలిసారిగా సీపీఐ రాష్ట్రమహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఏర్పాటి నాటి నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. ఇక్కడి ప్రజల పేరు చెప్పుకొని నాయకులు బాగుపడ్డారే కానీ ప్రజల జీవితాల్లో ఎలాంటి అభివృద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రకాశం జిల్లాకు జీవనాధారమైన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభించి నేటికి 29 ఏళ్లు గడుస్తున్నా పనులు నత్త నడకన సాగుతున్నాయని చెప్పారు. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్, దొనకొండలో పారిశ్రామిక వాడలు కేవలం హామీలుగానే మిగిలిపోయాయని చెప్పారు. ఈ హామీలు అమలుకాక పోవడంతో జిల్లాలో నిరుద్యోగం తాండవిస్తుందన్నారు. ప్రజలకు ఉపాధి లేక వలసబాటలు పడుతున్నారన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహాసభలను పురస్కరించుకొని వెయ్యి మంది కళాకారులు, 100 గొంతుకలతో, 100 కళారూపాలతో ప్రజాకళా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలకు దర్శకుడు బాబ్జీ, వందేమాతరం శ్రీనివాస్, మాదాల రవి, అజయ్‌ఘోష్, గోరటి వెంకన్న తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ బస్సు ప్రచారయాత్ర ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రా నాయక్, ఆర్.రామకృష్ణ, ఆరేటి రామారావు, ఎస్కే నజీర్, పిచ్చయ్య, గుర్రప్ప, అనంతలక్ష్మి, దేవరకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నదాతలను పట్టించుకోని ప్రభుత్వం

- ఆందోళన కలిగిస్తున్న రైతు ఆత్మహత్యలు
- ఎరువుల పంపిణీ, గిట్టుబాటు ధరలు కల్పించడంలో వైఫల్యం
- అన్నదాత సుఖీభవ నగదు పడక అన్నదాతల అవస్థలు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి


మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు సిటీ:

కూటమి ప్రభుత్వ లోప భూయిష్ట నిర్ణయాలతో రైతులకు సకాలంలో ఎరువులు అందక, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సాగుచేసిన పంటలకు కనీసం పెట్టుబడులు కూడా రాక జిల్లాలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. గిద్దలూరు మండలం ఓబులాపురం గ్రామంలో అప్పుల బాధ తాళలేక కౌలు రైతు తొట్టింపూడి దిలీప్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 8 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతులు చనిపోతున్నా కూటమి ప్రభుత్వం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. చనిపోయిన రైతు కుటుంబాలకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో వ్యవసాయ భూముల్లో సీఎం చంద్రబాబు షో చేసి వెళ్లిపోయారని విమర్శించారు. జిల్లాలో వేలాది మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వ వాటా పడలేదని మండిపడ్డారు. నగదు కోసం వారంతా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.

యూరియాతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా స్థానికంగానే పంపిణీ చేసిందని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఎరువుల కంపెనీలు కాంప్లెక్స్ ఎరువులను బస్తాకు రూ.100 నుంచి రూ.255 వరకు పెంచి విక్రయిస్తున్నా పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు.

గిట్టుబాటు ధర కల్పనలో విఫలం

కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బత్తుల బ్రహ్మానందరెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వంలో మామిడి కిలో రూ. 29 మద్దతు ధర ఉండగా, ఈ ఏడాది రెండు రూపాయలే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నగదు మొత్తాన్ని 24 గంటల్లో రైతు బ్యాంకు ఖాతాలో తమ చేస్తానని చెప్పిన ప్రభుత్వం, నెలలు గడిచినా జాడలేదని ఆరోపించారు. టమోటా, పత్తి, మిర్చి, శనగ, రొయ్యల రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు.

పొగాకు రైతుల పరిస్థితి మరీ దారుణం..

పండించిన పొగాకు మొత్తం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం చివరకు రైతుకు 20 చెక్కులకే పరిమితం చేయటం ఏంటని ప్రశ్నించారు. వేలం కేంద్రాలకు వస్తున్న బేళ్లలో అధిక సంఖ్యలో తిరస్కరిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమారెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

ఒంగోలు సిటీ: 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అన్న కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలు రాంనగర్ 5వ లైన్ల ఫుడ్ సేఫ్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన నాలుగు డీఏలు, పీఆర్సీ కమిటీ, ఐఆర్ మధ్యంత భృతి వంటి విషయాల గురించి చర్చించామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, ఉపాధ్యక్షుడు రమణ వెంకటేశ్వరరెడ్డి, గోపికృష్ణ, కోశాధికారి రంగారెడ్డి, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, కోశాధికారి ఏసురత్నం, శ్రీనివాసరావు, సునీల్ జవహరాలి, తాలూకా అధ్యక్షుడు సురేష్ బాబు, కార్యదర్శి శ్రీదేవి, చంద్రశేఖర్ శ్రీనివాసులు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మానస, వనజ, సుమతి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నుంచి 40 మందికి విముక్తి

● ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌వాసులకు రిలీఫ్ సర్టిఫికెట్లు ఇచ్చి స్వగ్రామాలకు..


కార్మికులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర అధికారులు

ఒంగోలు సబర్బన్: టంగుటూరు మండలంలోని రెండు రొయ్యల పరిశ్రమల్లో వెట్టి చాకిరీ చేస్తున్న 40 మంది ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర వాసులకు జిల్లా అధికారులు విముక్తి కల్పించారు. ఈ మేరకు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వారికి రిలీఫ్ సర్టిఫికెట్లు అందించారు. పనిచేసిన కాలానికి చట్ట ప్రకారం వారికి రావాల్సిన నగదును ఇప్పించడంతో పాటు ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించి బాధితులను వారి స్వస్థలాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. వీటికి సంబంధించిన వివరాలను ఒంగోలు ఆర్డీఓ కె.లక్ష్మీ ప్రసన్న తెలిపారు. ఒడిశా నుంచి 17 మంది, ఛత్తీస్‌గఢ్ నుంచి 23 మంది వచ్చి టంగుటూరు మండలంలోని రెండు రొయ్యల పరిశ్రమలలో పనిచేస్తున్నట్లు చెప్పారు. తమ జిల్లా ప్రజలు ఇక్కడ వెట్టి చాకిరీ చేస్తున్నారని ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కలెక్టర్ ఇచ్చిన సమాచారం మేరకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ అధికారులు ఈ బాధితులను సోమవారం రక్షించినట్లు తెలిపారు. ఒక మధ్యవర్తి మాయమాటలు చెప్పి ఈ వెట్టి చాకిరీ ఊబిలోకి దించారని, తమకు సరైన వసతిగానీ, ఆహారం గానీ, చేసిన పనికి డబ్బులు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని బాధితులు చెప్పినట్లు ఆర్డీఓ వివరించారు. బాధితుల్లో మైనర్లు కూడా ఉన్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సదరు పరిశ్రమలపై వెట్టిచాకిరీ నిర్మూలన, బాల కార్మిక నిర్మూలన, కనీస వేతన చట్టాల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. బాధితుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి బస్తర్ జిల్లా నుంచి వచ్చిన అధికారులతో వారి స్వస్థలాలకు పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎం.కోటేశ్వరరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మేరీ సుజాత, టంగుటూరు తహసీల్దార్ ఆంజనేయులు, డీసీపీఓ దినేష్‌కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సునీల్‌కుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు మాయం

● పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ముండ్లమూరు(దర్శి): మండలంలోని శంఖరాపురం గ్రామానికి చెందిన 1బీ రికార్డు మాయమైంది. దీంతో ఆరుగురు రెవెన్యూ అధికారులపై ముండ్లమూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..శంఖరాపురం గ్రామానికి చెందిన మేడికొండ వెంకటకృష్ణారావుకు, అదే గ్రామంలో మరొకరికి పొలం వివాదం ఉంది. 1బీ మాన్యువల్ రికార్డు చూసి న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను ప్రాధేయపడినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో కృష్ణారావు హైకోర్టులో కేసు వేశారు. ఈ రికార్డు అటు శంఖరాపురంలో వీఆర్వో వద్ద కానీ, ఇటు తహసీల్దార్ కార్యాలయంలో గానీ లేదు. దీంతో రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగానే మాయంచేసి ఉంటారని హైకోర్టు జడ్జి అభిప్రాయపడ్డారు. 1బీ రికార్డు మాయం వెనుక ఎవరెవరి పాత్ర ఉందో గుర్తించటంతో పాటు 2018 నుంచి 2022 వరకు పనిచేసిన రెవెన్యూ అధికారులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈమేరకు కలెక్టర్ స్థానిక తహశీల్దార్ లక్ష్మీనారాయణను అప్పుడు పనిచేసిన అధికారులపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఆయన ఫిర్యాదు మేరకు అప్పటి తహసీల్దార్లు జి.నాంచారయ్య, పాలపర్తి పార్వతి, అప్పటి డీటీ కె.రవికుమార్, ప్రస్తుత డీటీ అద్దంకి ప్రవంతి, అప్పటి సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, అప్పటి శంఖరాపురం వీఆర్వో నంబూరి గురవయ్యలను అనుమానితులుగా భావించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు.


పారిశుధ్య కార్మికులకు రాజకీయ వేధింపులు

● మస్టర్ పాయింట్ల వద్ద పారిశుధ్య కార్మికుల ఆందోళన


మస్టర్ పాయింట్ వద్ద ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగిపోయాయని సీఐటీయూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మస్టర్ పాయింట్ల వద్ద కార్మికులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న వారిని వివిధ రాజకీయ కారణాలతో విధుల నుంచి తప్పించారన్నారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని, 60 ఏళ్లు నిండిన వారికి జీఓ నంబర్–25 ప్రకారం ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు కార్మికులపై పర్యవేక్షణ పేరుతో పని జరగట్లేదని వివిధ కారణాలతో కార్మికుల్ని మస్టర్ ఆపేయటం, విధుల నుంచి తొలగించి మీ ఉద్యోగం తీసేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. కార్మికులకు పీఎఫ్ గానీ, ఈఎస్ఐ కార్డులు గానీ పరిపూర్ణంగా అమలు చేయలేదన్నారు. చనిపోయిన కార్మికులకి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ క్లైమ్ చేయడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్మికులు చనిపోతే రెండు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా కూడా కార్మికులకి అందలేదన్నారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహ, టి.విజయమ్మ, నాయకులు యు.రత్నకుమారి, మోహన్, రాములు, ఎద్దురవి, ఎం .బాబు, ఆర్ శ్రీనివాసరావు, పి సుబ్బారావు, ఆనంద్, కె. వెంకటేశ్వర్లు, ఎం లక్ష్మీకాంతం, నాగలక్ష్మి, కే వంశీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐఓగా ఆంజనేయులు బాధ్యతల స్వీకరణ


ఆర్ఐఓ ఆంజనేయులుకు అభినందనలు తెలిపిన సిబ్బంది

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ బోర్డు ప్రకాశం జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా ఇంటర్ విద్య అధికారిగా వ్యవహరిస్తున్న తాళ్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. ఆంజనేయులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్ఐఓగా పనిచేస్తున్న ఏ సైమన్‌విక్టర్ ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణ అధికారిగా నియామకం పొందడంతో ఆ బాధ్యతలను కూడా డీఐఈఓ ఆంజనేయులుకు అప్పగిస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి డాక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆంజనేయులు ఆర్ఐఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.